క్లుప్తంగా

గెస్ట్ అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని జ్యోతి బాపూలే డిగ్రీ కళాశాలలో గెస్ట్ అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హత కలిగిన వారు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వీర ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, చరిత్ర, కామర్స్, లైబ్రేరియన్ సబ్జెక్టులో ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మెరిట్ ప్రకారం ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈ అవకాశాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న తహసీల్దార్ ముక్తార్ పాషా

వీర్నపల్లి: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ ముక్తార్ పాషా, ఎంపీడీవో బీరయ్య అన్నారు. గురువారం మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. వసతి గృహం పరిసరాలు, తరగతి గదులు, మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆర్ఐ శివకుమార్, ఉపాధ్యాయులు, వంట సిబ్బంది ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ఇల్లంతకుంట: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా కమ్యూనిటీ ఎడ్యుకేటర్ మంద జనార్దన్ అన్నారు. గురువారం మండలంలోని దాచారం హైస్కూల్‌లో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాణి, ఉపాధ్యాయులు టి నరేందర్ రెడ్డి, దావీద్, సంజీవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపును అమలు చేయాలి

బోయినపల్లి: కాంగ్రెస్ ఇచ్చిన హామీమేరకు ఆసరా పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవి మాదిగ, సీనియర్ నాయకుడు సీహెచ్. పురుషోత్తమరావు పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలో దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. వృద్ధులు, వితంతు, బోధకాలు, బీడీ కార్మికుల పింఛన్లు రూ.4వేలు, దివ్యాంగులకు రూ. 6వేలు పెంచాలని డిమాండ్ చేశారు. మండల దివ్యాంగులతో ఈనెల 3న జరిగే సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఆగస్టు 13న లక్షలాది మందితో హైదరాబాద్‌లో మందకృష్ణ ఆదేశాలతో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. చెన్నమనేని పురుషోత్తమరావు, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మండల కన్వీనర్ అక్కెనపెల్లి పర్శరాములు, జిల్లా నాయకురాలు శోభారాణి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఆవునూరి ప్రభాకర్, ఖానాపురం లక్ష్మి, కత్తెరపాక రవీందర్, కన్నం సాగర్, జగన్, సూర్య, తదితరులు ఉన్నారు.

కొత్త పింఛన్లు ఇవ్వాలి



తంగళ్లపల్లి: రాష్ట్రంలో కొత్త పెన్షన్లు అమలుచేసి పాత పింఛన్ల మొత్తాన్ని పెంచాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సావనపెల్లి బాలయ్య అన్నారు. గురువారం మండలంలోని గోపాలరావుపల్లెలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బాలయ్య మాట్లాడుతూ వికలాంగులు, వృద్ధాప్య, వితంతు, బోధలు, ఒంటరి మహిళల పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవన్న, జిల్లా అధ్యక్షుడు ఖానాపూర్ లక్ష్మణ్, గౌరవ అధ్యక్షుడు మల్యాల లక్ష్మణ్, నాయకులు గుండు ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ ములిగె దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

చందుర్తి: వివిధ ఫోన్ నెంబర్ల నుంచి కాల్స్ చేసి వేధించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ జెడ్పీటీసీ నాగం కుమార్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫైనాన్షియల్స్ లోన్ తీసుకుని, చెల్లించడం లేదని ఐదు రోజులుగా తనకు, బంధుమిత్రులకు గుర్తు తెలియని నెంబర్ల నుంచి ఫోన్స్ చేస్తున్నారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం



అధ్వానంగా మామిడిపల్లి - ఎన్గల్ రహదారి



మామిడిపల్లి- ఎన్గల్ మధ్య వాగు

- మామిడిపల్లి – ఎన్గల్ రోడ్డుకు మోక్షమెప్పుడో!
- అధ్వానంగా రహదారి.. వాహనదారుల ఇక్కట్లు
- రోడ్డు నిర్మిస్తే రెండు మండలాల ప్రజలకు ప్రయోజనం

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి నుంచి చందుర్తి మండలం ఎన్గల్ వెళ్లే రహదారికి గత కొన్నేళ్లుగా మోక్షం లభించడం లేదు. ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని కొన్నేళ్లుగా ఇరుగ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ రెండు గ్రామాల మధ్య రోడ్డు పూర్తయితే చందుర్తి–కోనరావుపేట మండలాల మధ్య దూరం తగ్గనుంది. మామిడిపల్లి నుంచి చందుర్తి మండలంలోని ఎన్గల్‌కు మధ్య నాలుగు కిలోమీటర్ల దూరం ఉంటుంది. కోనరావుపేట మండలం నుంచి చందుర్తి మండలానికి వెళ్లాలంటే ఇది దగ్గరి రోడ్డు. మామిడిపల్లి నుంచి ఎన్గల్, మరిగడ్డ, చందుర్తి, జోగాపూర్, మల్యాల గ్రామాలకు వెళ్లాలంటే దగ్గరి రహదారి.

ఏళ్లుగా ఎదురుచూపులు

మండలంలోని మామిడిపల్లి నుంచి ఎన్గల్‌కు వెళ్లే రోడ్డుకు నిధుల కోసం రెండు గ్రామాల ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఈ రహదారిని తారురోడ్డుగా మార్చాలని పలుసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు, ప్రతిపాదనలు ఇచ్చారు. అయినా ఫలితం లేదు. ఇప్పటికైనా ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తగ్గనున్న దూరం

మామిడిపల్లి– ఎన్గల్ గ్రామాల మధ్య రోడ్డు పూర్తయితే రెండు మండలాల మధ్య దూరభారం తగ్గుతుంది. మామిడిపల్లి నుంచి నేరుగా ఎన్గల్ గ్రామానికి వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు ఉంటుంది. రోడ్డు బాగు లేకపోవడంతో వేములవాడ మండలం హన్మాజీపేట గ్రామం మీదుగా వెళ్లాల్సి వస్తోంది. ఈ దారిన వెళితే 12 కిలోమీటర్లు దూరం ఉంటుంది. అదే రహదారి అయితే 8 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. పైగా సర్కిల్ కార్యాలయం చందుర్తి ఏర్పాటు చేయడంతో ఈ రోడ్డుపై వెళ్లడం తప్పనిసరిగా మారిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

నిధులు మంజూరు చేయాలి



మామిడిపల్లి నుంచి ఎన్గల్‌కు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు వర్షాకాలంలో అవస్థలు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం అయితే రెండు మండలాల మధ్య దూరం తగ్గుతుంది. రెండు మండలాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది. సమయం ఆదా అవుతుంది. నిధులు మంజూరు చేయాలి.

– సాసాల మల్లారెడ్డి, మామిడిపల్లి

బీటీ రోడ్డుగా మార్చాలి



కోనరావుపేట మండలాన్ని వేములవాడ సర్కిల్ పరిధిలోంచి చందుర్తి సర్కిల్‌కు మార్చారు. దీంతో మండలంలోని కనగర్తి, నిజామాబాద్, కోనరావుపేట, వెంకట్రావుపేట తదితర గ్రామాల ప్రజలు చందుర్తికి వెళ్లాలంటే ఇదే దారి. ఈ దారిలో వర్షాలుపడితే వెళ్లరాదు. నిధులు మంజూరు చేసి తారురోడ్డుగా మార్చాలి.

– ఎల్లాల లింగారెడ్డి, మామిడిపల్లి

పథకాలను పారదర్శకంగా అమలు చేయాలి



ముస్తాబాద్: ప్రభుత్వ పథకాలను ప్రజలకు పారదర్శకంగా అందించాల్సిన బాధ్యత అధికారులదేనని బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్ అన్నారు. ముస్తాబాద్ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన లచ్చాలును బీజేపీ నాయకులు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు అర్హులకు అందించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజల వద్దకు వెళ్లేలా చూడాలన్నారు. లబ్ధిదారులు ఎంపిక ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని కోరారు. ఏడాదిన్నరగా ప్రభుత్వం నుంచి మండల పరిషత్‌కు రూపాయి కూడా రాలేదన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ యెల్ల గిరి, కాసోడి రమేశ్, శంకర్, బుర్ర శ్రీను, గణేశ్, నగేశ్, జక్కుల నూతన్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్నాలపై బీజేపీ నాయకుల మాటలు సిగ్గుచేటు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: రైతులకు సన్నవడ్లకు బోనస్ అందిస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గౌస్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేస్తున్నామన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పారన్నారు. బీజేపీ కొట్లాడితేనే కాంగ్రెస్ సన్నాలకు బోనస్ ఇచ్చిందని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు గుండాడి రాంరెడ్డి, బాబు, తిరుపతిగౌడ్, బండారి బాల్‌రెడ్డి, నంది కిషన్, మల్లారెడ్డి, బుచ్చాగౌడ్, శ్రీనివాస్, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఇల్లంతకుంట: అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సేవా సమితి మండల కార్యవర్గాన్ని గురువారం అయ్యప్ప ఆలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సింగిరెడ్డి రమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా కొండ్ల వెంకటరెడ్డి, గోగూరి శ్రీనివాసరెడ్డి, దొమ్మాటి కిషోర్, బొల్లం వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా నాగ సముద్రాల రాజు, సహాయ కార్యదర్శిగా రెడ్డి మధుకర్ రెడ్డి, బూర్ల సంతోష్, కోశాధికారిగా ముత్యాల మధుకర్ రెడ్డి, సహాయ కోశాధికారిగా గొట్టిపర్తి యాదగిరిగౌడ్, ప్రచార కార్యదర్శిగా కామల్ల శ్రీనివాస్, ముంజ భూపతి గౌడ్, ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా ఎర్రోజు గోపాలాచారి, కామల్ల ఎల్లయ్య, నలమాచు శ్రీనివాస్, సామ మదన్మోహన్ రెడ్డి ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా బిల్ల రఘు, రవీందర్ రెడ్డి, కట్ట ఎల్లారెడ్డి, రాజు ఎన్నికయ్యారు.

సన్మానం

తంగళ్లపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన అబ్దుల్ హఫీజ్ (బాబా)ను గురువారం సత్కరించారు. సిరిసిల్ల ఆర్డీవో మండల స్పెషల్ అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సూపరింటెండెంట్ రమేశ్, ఎంపీవో మీర్జా, ఏపీవో నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చాంపియన్ షిప్ పోటీలు

సిరిసిల్ల అర్బన్: రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో యువ తెలంగాణ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీల ఎంపిక నిర్వహించనున్నట్లు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేశం, కార్యదర్శి మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు మధ్యాహ్నం 3 గంటలకు ఒరిజినల్ ఆధార్‌కార్డుతో పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో రిపోర్ట్ చేయాలన్నారు. ఎంపికైన క్రీడాకారులకు ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 8 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు.

కమిటీ ఎన్నిక

కోనరావుపేట: మండలకేంద్రంలో కోనరావుపేట గ్రామశాఖ నూతన చేయూత పింఛన్‌దారుల గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి తెలిపారు. గ్రామశాఖ అధ్యక్షురాలిగా దాత్రుక అంజలి, ఉపాధ్యక్షురాలిగా మార్గం భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా మార్గం ప్రమీల, కార్యదర్శిగా ఆముద లక్ష్మి, సహాయ కార్యదర్శిగా ఆముద సుమలత, సభ్యులుగా ఆముద శివాని, ఆముద ఉమా, దండు మాధవి, దాసరి భాగ్య, మార్గం ప్రమీలను ఎన్నుకున్నారు. చేయూత పింఛన్‌దారులు దాసరి కళావతి, దాసరి భాగ్య, ఎక్కలి లచ్చవ్వ, తోట లక్ష్మి, బెండ లలిత, బెండ హారిక, గుడిపల్లి లక్ష్మి, గుడిపల్లి మంజుల, నేరెళ్ల లక్ష్మి, ఇల్లందుల పద్మ, చీకోటి సత్తవ్వ, ముదాం లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత



టై, బెల్టులు పంపిణీ చేసిన పూర్వ విద్యార్థులు

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల హై స్కూల్‌లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు గత విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. 18 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పెన్నులు అందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్ గౌడ్, హెచ్ఎం దూస గోవర్ధన్, కే వెంకట నరసింహారెడ్డి, చాంద్ పాషా, సరోజినీ దేవి, సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

టై, బెల్టులు పంపిణీ

గాలిపెల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 1989–90లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు టై బెల్టులు పంపిణీ చేశారు. మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్ గౌడ్, ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు బద్దం రవీందర్ రెడ్డి, చేరాల సుధాకర్, ఉపాధ్యాయులు బ్రహ్మాచారి, స్వామి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పదు



రాజ మనోహర్‌రావును సన్మానిస్తున్న జిల్లా అధికారుల సంఘం ప్రతినిధులు

సిరిసిల్ల: ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పదని జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి బాలసంకుల రాజ మనోహర్‌రావు రిటైర్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పూలమాలలు, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వేములవాడ ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయి, సీపీవో శ్రీనివాసచారి జిల్లా అధికారులు భారతి, లక్ష్మీరాజం, రజిత, రాఘవేంద్రర్, రామకృష్ణ, అఫ్జల్‌బేగం, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధి శాత్రాజుపల్లిలో సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి దివ్యశ్రీ, ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకుడు పెంచలయ్య అధ్యక్షతన 185 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.164 మందికి హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏరియా ఆసుపత్రి వైద్యురాలు సుభాషిని విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ వైద్యుడు లహరి, మధు ప్రవచిని, స్వప్న, ఆరోగ్య పర్యవేక్షకురాలు ఝాన్సీమణి, ఏఎన్ఎంలు సృజన, లలిత, శైలజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

భూమిపూజ

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం డైనింగ్ హాల్‌కు భూమిపూజ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం సమయంలో ఇబ్బంది పడుతున్న దృష్ట్యా మండల పరిషత్ నిధుల ద్వారా హాల్‌కు భూమి పూజ చేసినట్లు మాజీ వైస్ ఎంపీపీ జక్కుల కవిత– తిరుపతి తెలిపారు. ఒకటో వార్డు పరిధిలో సుమారు రూ.15 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం, బీరప్ప ఆలయానికి రూ.12 లక్షలు, ముదిరాజ్ సంఘం, హనుమాన్ ఆలయం వద్ద రూ. 6 లక్షలతో బోర్లు వేసినట్లు తెలిపారు. సుమారు రూ.6 లక్షల మండల పరిషత్ నిధులతో డైనింగ్ హాల్ నిర్మాణం, ఎంపీ బండి సంజయ్ నిధులు రూ.5లక్షలతో హైమాస్ట్ లైట్లు వేసినట్లు పేర్కొన్నారు. స్కూల్ కమిటీ చైర్మన్, బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'గిరిజన నాయకుల అరెస్ట్ అప్రజాస్వామికం'

ఎల్లారెడ్డిపేట: హైదరాబాద్‌లోని గాంధీ భవన్ ముట్టడికి తరలివెళ్లిన లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అజ్మీరా తిరుపతినాయక్ అన్నారు. మండలకేంద్రంలో మాట్లాడుతూ లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని, కులగణనలో లంబాడీల జనాభా తెలపాలని కోరుతూ శాంతియుతంగా గాంధీభవన్ ముట్టడి చేసిన నాయకులను అరెస్టు చేశారని, ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించాలన్నారు.



గంభీరావుపేట: గంభీరావుపేట మండలం జగదాంబ తండాలో ప్రధాన రహదారిపై ఎండిపోయిన చెట్లతో ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉంది. గాలులకు ఎప్పుడు ఎండిపోయిన వృక్షాలు మీద పడుతాయోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : నిఖిల్ సాయి, ఆర్అండ్‌బీ ఏఈ, సెల్ : 9440818863

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

అన్ని వర్గాలకు అండగా కాంగ్రెస్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ : పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ/వేములవాడ అర్బన్: సీఎం రేవంత్‌రెడ్డి మహిళల ఆర్థికాభివృద్ధికి రూ.20 వేల కోట్లు కేటాయించారని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం వేములవాడ అర్బన్ మండల బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నాగారం కొమురవ్వ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన 50 మంది మహిళలను ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, కాంగ్రెస్ అన్ని వర్గాల వారికి అండగా ఉంటుందన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

ముస్తాబాద్: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. ముస్తాబాద్‌లో వరలక్ష్మి ఆస్పత్రిని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. వైద్యుడు బొప్పసాగర్, ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు క్రాంతి, చక్రధర్‌రెడ్డి, దేవేందర్, ఆది లక్ష్మణ్, ఆదివెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



ఎల్లారెడ్డిపేట : అల్మాస్‌పూర్ తండాలో బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్, కిష్టునాయక్, బుగ్గరాజేశ్వర తండాల్లో నాటుసారా స్థావరాలపై గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో బెల్లం పానకం, నాటుసారా, పటికను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. గుడుంబా తయారు చేస్తున్నారన్నా సమాచారంతో సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసంచేసి, 20 కిలోల బెల్లం, 10 కిలోల పటిక, 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురిపై కేసులు నమోదు చేశామన్నారు. దాడుల్లో డీటీఎఫ్ ఎస్సై శైలజ, సిబ్బంది రాజు, కిశోర్, మల్లేశ్, హమీద్,సుమన్, రాకేశ్ పాల్గొన్నారు.

అడవి పదిరలో..

వీర్నపల్లి: మండలంలోని అడవిపదిరలో ఎస్సై వేముల లక్ష్మణ్ ఆధ్వర్యంలో గురువారం గుడుంబా స్థావరాలపై దాడి చేశారు. తండాకు చెందిన భూక్య సుజాత, భూక్య శివలాల్ ఇళ్లల్లో తనిఖీ చేయగా 150 లీటర్ల సారాకు ఉపయోగించే ముడి సరుకులు దొరికాయి. వాటిని స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేశారు.



'ఇందిరమ్మ' లబ్ధిదారుడి అభిమానం

కోనరావుపేట: మండలంలోని పల్లిమక్త గ్రామానికి చెందిన నాయిని నరహరి, లావణ్య దంపతులకు కొన్నేళ్లుగా ఇల్లు లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తమకు ఇల్లు మంజూరైందని, సొంతింటి కల నెరవేరుతుండటంతో హర్షం వ్యక్తంచేశారు. ఇల్లు కడప పెట్టుకున్న సందర్భంగా పూజా కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటం పెట్టి తమ అభిమానం చాటుకున్నారు. ప్రజా ప్రభుత్వంలో తమకు అన్ని రకాల పథకాలు అందుతున్నాయన్నారు.

'క్షయ'పై అవగాహన



బోయినపల్లి: మండలంలోని జగ్గారావుపల్లిలో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా క్షయవ్యాధిపై వైద్యాధికారి అనూష ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులు, పొగ తీసుకునే వారు క్షయవ్యాధికి గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు జ్వరం, ఆకలి లేకపోవడం, రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం వంటి లక్షణాలున్నవారు వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. 76 మందికి పైగా టీబీ స్క్రీనింగ్ చేశామని 15 మంది అనుమానితుల నుంచి తెమడ నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించామన్నారు. మరో ఆరుగురిని సిరిసిల్ల రేడియాలజీ ల్యాబ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అరవింద్, కృప, ప్రకాశ్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

గంభీరావుపేట: మండలకేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీ బండి సంజయ్ కుమార్ రెండు బోరు బావుల తవ్వకానికి నిధులు మంజూరు చేసినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. గురువారం బోర్లు వేయించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేశ్, మాజీ అధ్యక్షుడు గంట అశోక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానితుడి నిర్బంధం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో బుధవారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని గ్రామస్తులు నిర్బంధించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి వారికి అప్పగించారు. బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండంతో గ్రామస్తులు అతని వద్దకు వెళ్లి వివరాలు రాబట్టారు. అతని నుంచి సరైన సమాధానం రాకపోవడంతో అనుమానంతో స్తంభానికి కట్టేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.